www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 20 జులై 2024

5

ఏలూరు



గొడుగుల పంపిణీ



ఏలూరుఅర్బన్: స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వచ్చే రోగులకు, ఆర్ఆర్‌పేటలో రోడ్డుపై వెళ్లే పాదచారులకు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి శుక్రవారం గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల నుంచి వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తుండటంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు, రోడ్డుపై వెళ్లే పాదచారులకు గొడుగులు పంపిణీ చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. దాత ఏలూరు వైభవ్ జ్యుయలర్స్ అధినేత గ్రంధి అమరేంద్ర సహకారంతో 30 మందికి గొడుగులు పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె.వరప్రసాదరావు, డాక్టర్ జి.స్పందన, ఎ.సూర్యనారాయణ పాల్గొన్నారు.



కొట్టుకుపోయిన మేడిపల్లి- వేలేరుపాడు రోడ్డు



అల్లూరి నగర్‌లో ఇళ్లలోంచి కొట్టుకొచ్చిన సామగ్రి

భయం.. భయం..!

రెండు జిల్లాలపై వర్షాలు, వరదల ప్రభావం

చిగురుటాకులా వణుకుతున్న ఏజెన్సీ

పెద్దవాగు ప్రాజెక్టుకు గండచీశీలవంగడితో 14 గ్రామాలపై పెనుప్రభావం

ఇళ్లు కూలి, పశువులు చనిపోవడంతో జనం గగ్గోలు

కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పలుచోట్ల రోడ్లకు గండ్లు

పలు గ్రామాలకు రాకపోకలు బంద్, 48 గంటలుగా కరెంట్ కట్

ప్రమాదకర స్థాయిలో ఎర్రకాలువ ఉధృతి

20 వేల ఎకరాల్లో నాట్లు, 1480 ఎకరాల్లో నారుమళ్లు మునక

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గడిచిన 48 గంటలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. వర్ష బీభత్సానికి ఏజెన్సీలో వాగులు, వంకలు పొంగుపొర్లుతుండటం, పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడటంతో అక్కడి ప్రజలు చిగురుటాకులా వణికిపోతున్నారు. భారీ వర్షాలకు డెల్టా ప్రాంతంలో వేల ఎకరాల్లో నాట్లు నాటిన పొలాలు, నారుమడులు నీట మునగడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా రెండు జిల్లాల్లోనూ వర్షం వెంటాడుతోంది. గడిచిన 24 గంటల్లో ఏలూరు జిల్లాలో సరాసరిన 99.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే, అత్యధికంగా ఏజెన్సీ ప్రాంతాలైన వేలేరుపాడులో 269 మిల్లీమీటర్లు, బుట్టాయగూడెంలో 268.8, కుక్కునూరులో 178.8, జంగారెడ్డిగూడెంలో 168, జీలుగుమిల్లిలో 141.2, మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పశ్చిమగోదావరి జిల్లాలో సరాసరిన 87.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవ్వగా, తాడేపల్లిగూడెంలో అత్యధికంగా 133 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. భారీ వర్షాలకు ఏజెన్సీలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. రిజర్వాయర్లలోకి భారీగా వరదనీరు చేరడంతో దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో లోతట్టు ప్రాంతాలు నీట మునుగుతున్న ప్రమాదం ఏర్పడింది. ఏజెన్సీలో పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడటంతో వేలేరుపాడు మండలాల్లోని మేడిపల్లి, కమ్మరిగూడెం, అల్లూరి నగర్, మాధవరం, రామవరం, గుల్లవాయి వంటి 14 గ్రామాలపై తీవ్ర ప్రభావం పడింది. పలు ఇళ్లు నేలమట్టమయ్యాయి. కరెంటు స్తంభాలు నేలనంటాయి. భారీగా పశువులు మృతి చెందాయి.



వరద ప్రాంతాల్లో మోటారు సైకిల్‌పై పర్యటిస్తున్న కలెక్టర్

దీంతో ఆయా గ్రామాల ప్రజలు కట్టుబట్టలతో మిగిలిన పరిస్థితి నెలకొంది. శుక్రవారం మూడు వేల భోజనం ప్యాకెట్లు అధికారులు పంపిణీ చేశారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో వేరే చెప్పనక్కర్లేదు. విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో గడిచిన 48 గంటలుగా వేలేరుపాడు, కుక్కునూడు మండలాల్లో కరెంటు లేకుండాపోయింది. దీంతో అక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. భారీ వర్షాలకు కుక్కునూరు, దాచారం మధ్య ఉన్న గుండేటి వాగు అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోవడంతో బెస్తగూడెం, నెమలిపేట, అరసపల్లి, గొమ్ముగూడెం, సీతారామపురం వంటి 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాలకు వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. కుక్కునూరు మండలం ఉప్పేరు దగ్గర వాగు పొంగి రెడ్డిగూడెం గ్రామంలోని ఆరు ఇళ్లు నీటమునిగాయి. వీరిని సురక్షిత ప్రాంతాలకు తరలించిన పరిస్థితి కొనసాగింది. వేలేరుపాడు మండలంలో నార్లవరం, బోళ్లపల్లి మధ్య ఎద్దువాగు వంతెన దెబ్బతిని పది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పెద్దవాగు ప్రాజెక్టుకు గండి పడటంతో వేలేరుపాడు, కుక్కునూరు మండలాలకు వెళ్లే ప్రధాన రహదారులకు సైతం గండ్లు పడటంతో పరిస్థితి అధ్వానంగా మారింది. శుక్రవారం కలెక్టర్, ఎస్‌పి ఇతర అధికారులు ఏజెన్సీలో పర్యటించి సహాయక చర్యలకు ఆదేశించారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 26.30 అడుగులకు చేరింది. దిగువకు 3.30 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు వద్ద నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. గోదావరికి పెద్దగా వరద పోటు లేకపోవడం ఊరట కలిగించే అంశంగా చెప్పొచ్చు.

జలాశయాల నుంచి పెద్దఎత్తున నీటి విడుదల

ఏజెన్సీలో కురుస్తున్న వర్షాలకు అక్కడి జలశయాలకు భారీగా వరదనీరు చేరుతోంది. దీంతో పలు జలాశయాల నుంచి దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. ఎర్రకాలువ ప్రాజెక్టుకు 25 వేల క్యూసెక్కుల వరద నీరు చేరుతుండటంతో దిగువకు 14,524 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో జంగరెడ్డిగూడెం మండలంలోని లక్కవరం పరిసర గ్రామాల్లోకి వరదనీరు చేరుతోంది. నల్లజర్ల, తాడేపల్లిగూడెం మండలాల్లోని మాధవరం, మారంపల్లి, జగన్నాధపురం, వీరంపాలెం, దండగర్ర గ్రామాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పంటపొలాలు నీట మునుగుతున్నాయి. బుట్టాయగూడెం మండలంలోని గుబ్బల మంగమ్మ ప్రాజెక్టు నుంచి 1500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కొవ్వాడ, పోగొండ ప్రాజెక్టుల్లోకి పెద్దఎత్తున వరద నీరు చేరుతోంది. శుక్రవారం వాగుల ఉధృతి కొంత తగ్గినప్పటికీ పరిస్థితి మాత్రం ఇంకా ప్రమాదకరంగానే ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

20 వేల ఎకరాల్లో పంట పొలాలు మునక

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీవర్షాలకు రెండు జిల్లాల్లోనూ పెద్దఎత్తున పంటపొలాలు ముంపునకు గురవుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పటి వరకూ 15,485 ఎకరాల్లో నాట్లు, 1240 ఎకరాల్లో నారుమడులు ముంపునకు గురయ్యాయి. ఏలూరు జిల్లాలో 4,187 ఎకరాల్లో నాట్లు, 240 ఎకరాల్లో నారుమడులు మునిగాయి. ఏలూరు జిల్లాలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, ద్వారకాతిరుమల, చింతలపూడి ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగాయి. వెంటనే వరదనీరు తగ్గితే నష్టం తగ్గే అవకాశం ఉంది. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంటే మాత్రం రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఎకరాకు రూ.పది వేలకుపైగా రైతులు పెట్టుబడులు పెట్టిన పరిస్థితి ఉంది.

ఆదుకుంటాం.. అధైర్యపడకండి

కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్‌పి కొమ్మి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - వేలేరుపాడు



వరద ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్‌పి, జెసి పర్యటన

పెద్దవాగు వరద ప్రభావంతో ముంపునకు గురైన వేలేరుపాడు మండలం అల్లూరినగర్‌వాసులను కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్‌పి కొమ్మి ప్రతాప్‌శివకిషోర్ పరామర్శించి ధైర్యం చెప్పారు. శుక్రవారం వారు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. బాధిత ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులను అత్యవసరంగా వరద సహాయ కేంద్రాలకు తరలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వరద సహాయక కేంద్రాల్లో బాధితులకు భోజనం, వసతి సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కారు వెళ్లలేని మారుమూల ప్రాంతాలకు బైక్ మీద ప్రయాణించి బాధితులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. వరద సహాయక కేంద్రాలకు రావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఆకస్మిక వరదల కారణంగా ప్రమాదాలు జరగొచ్చని, అంతా తప్పనిసరిగా వరద సహాయక కేంద్రాలకు రావాలని కోరారు. అనంతరం పెదవాగు బ్రిడ్జిపై గండి పడిన ప్రాంతాన్ని కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. పెదవాగుపై ప్రాంతంలో వరద నీటిని విడుదల చేసే సమయంలో లోతట్టు ప్రాంతాలు మునిగిపోయే ప్రమాదం ఉన్నందున, నీరు విడుదల చేసే సమయానికి కనీసం 12 గంటల ముందుగా తెలియజేస్తే ప్రమాదాన్ని నివారించడంతోపాటు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుంటుందన్నారు. ఇక నుండి ఈ దిశగా చర్యలు తీసుకోవాలని తెలంగాణా ఇరిగేషన్ అధికారులకు కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటిడిఎ పిఒ సూర్యతేజ, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ అద్దయ్య, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ సాల్మన్‌రాజు, డిపిఒ టి.శ్రీనివాస విశ్వనాథ్, తహశీల్దారు, డిఎస్‌పి తదితరులు ఉన్నారు.

అధికారులను మరింత అప్రమత్తం చేశాం: కలెక్టర్

భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో అధికారులను మరింత అపమత్తం చేశామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. శుక్రవారం వేలేరుపాడులో ఆమె మీడియాతో మాట్లాడుతూ పెద్దవాగు వరద నీరు తగ్గినప్పటికీ ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు ఆహార పొట్లాలను అందించేందుకు శుక్రవారం మధ్యాహ్నం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో తయారు చేయించామన్నారు. మూడు వేల ఆహార పొట్లాలు, తాగునీరు ఏర్పాటు చేశామన్నారు. బాధితులను రాత్రిపూట పునరావాస కేంద్రంలోనే ఉండాలని చెప్పామని, అక్కడే ఆహార ఏర్పాట్లు చేశామని తెలిపారు. పెద్దవాగు వరద మూలంగా దెబ్బతిన్న రహదారి మరమ్మతులు చేయాల్సి ఉందని, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయన్నారు. తొమ్మిది నెలలు నిండిన గర్భిణులను పిహెచ్‌సిల్లో చేర్చేందుకు వారికి కౌన్సిలింగ్ నిర్వహించినట్లు వివరించారు.

వరద ప్రాంతాల్లో రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

జంగారెడ్డిగూడెం టౌన్: జిల్లాలో వరద ప్రమాదం ముగిసే వరకు అధికారులు, సిబ్బంది అందరూ పూర్తి అప్రమత్తతతో ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. వరదల నేపథ్యంలో తీసుకోవాల్సిన అత్యవసర చర్యలపై స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఆమె అధికారులతో సమీక్షించారు. వరద ప్రభావిత గ్రామాల్లో సహాయక చర్యల నిమిత్తం రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలన్నారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది అంతా వరద సమయంలో ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. అవసరమైన లైఫ్‌బోట్లు, లైఫ్ జాకెట్లు, గజఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అత్యవసరంగా 80 వేల వాటర్ ప్యాకెట్లను కుక్కునూరు, వేలేరుపాడుల్లో సిద్ధంగా ఉంచాలని, ఆయా గ్రామాలకు వాటర్ ట్యాంకర్లను పంపాలని ఆదేశించారు. జిల్లా ఎస్‌పి కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ విపత్తు నిర్వహణపై పటిష్టమైన సమాచార వ్యవస్థను ఏర్పాటుచేసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఎద్దువాగు, పెద్దవాగు, ఎర్రకాల్వలు పొంగుతున్నాయని, వాటినుండి నీటి విడుదల స్థాయిలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నీటి విడుదల సమాచారాన్ని ఇరిగేషన్ శాఖ అధికారులు కనీసం 12 గంటల ముందుగా తెలియజేయాలన్నారు. పాముకాటు చికిత్సకు అవసరమైన యాంటీ వీనం మందులు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో ఐటిడిఎ పిఒ సూర్యతేజ, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కె.అద్దయ్య, డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ఠ, డిపిఒ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, ఇరిగేషన్ ఎస్ఇ ప్రకాష్, ఐసిడిఎస్ పీడీ పద్మావతి పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. భారీ వర్షాల కారణంగా ఎటువంటి ఇబ్బందులు ఎదురైతే ప్రజలు వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కలుషిత నీరు తాగడం వల్ల అతిసార ప్రబలే ప్రమాదం ఉందని, విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడటం వల్ల విద్యుత్ సరఫరాకు, రాకపోకలకు అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉందని, వీటిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

వీడని వర్షం.. తగ్గని ముంపు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బుట్టాయగూడెం నుండి జీలుగుమిల్లి వెళ్లే మార్గంలో రెడ్డిగణపవరం వద్ద జల్లేరు వాగు పొంగడంతో కాజ్‌వే పూర్తిగా దెబ్బతింది. దీంతో ఈ కాజ్‌వే పై నుంచి రాకపోకలను పోలీసు, రెవెన్యూ సిబ్బంది నిలిపివేశారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలు సాగించాలని జీలుగుమిల్లి సిఐ క్రాంతికుమార్, బుట్టాయిగూడెం ఎస్ఐ కె.వెంకన్న సూచించారు. కోటరామచంద్రపురం, కన్నాపురం, పద్మవారిగూడెం, ఇప్పలపాడు కాజ్‌వేలపై వరద ఉధృతి తగ్గడంతో రాకపోకలు పునరుద్ధరించారు. భారీ వర్షాలకు మండలంలో అధికంగా వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. వరి నారుమళ్లు, మొక్కజొన్న చేలల్లో నీరు నిల్వ ఉండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గుబ్బల మంగమ్మ గుడికి వెళ్లే రోడ్డు బాగా దెబ్బతినడంతో ఆలయ కమిటీ, జనసేన కార్యకర్తలు మరమ్మతులు చేట్టారు. కోర్సవారిగూడెం పంచాయతీ కామవరం అటవీ ప్రాంతంలోని గుబ్బల మంగమ్మ గుడి సమీపంలో వాగు ఉధృతి భీభత్సం సృష్టించింది. దీంతో గుబ్బల మంగమ్మ గుడి దగ్గర రహదారులు పూర్తిగా పాడైపోవడంతోపాటు పెద్దపెద్ద వృక్షాలు విరిగిపడ్డాయి. జెసిబి సాయంతో ఆలయ కమిటీ, జనసేన కార్యకర్తలు చెట్లు తొలగించి మరమ్మతులు చేపట్టారు. భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో గుబ్బల మంగమ్మ గుడికి ఎవరూ వెళ్లనీయకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ ఆలయానికి ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి యాత్రికులు వస్తుంటారని, అయితే వర్షాల సమయంలో గుడి వద్దకు అనుమతించేది లేదని ముందస్తుగా ప్రచారం చేయాలని సూచించారు. ఆలయ కమిటీ, పోలీస్, రెవెన్యూ సిబ్బందితో కామవరం గ్రామం వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేసి వర్షాకాలంలో యాత్రికుల రాకపోకలను నియంత్రించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు.

దొరమామిడిలోని జల్లేరు జలాశయంలోకి వరద ఉధృతి పెరగడంతో గేట్లు ఎత్తి 1500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలోకి మూడు వేల క్యూసెక్కుల వరద నీరు వస్తోందని, జలాశయం పూర్తి నీటిమట్టం 217.80 టిఎంసిలని, ప్రస్తుతం 215 టిఎంసిలకు చేరడంతో ముందు జాగ్రత్త చర్యగా 1,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. పోగొండ ప్రాజెక్ట్, కొవ్వాడ రిజర్వాయర్లు పూర్తి నీటి సామర్థ్యంతో నిండుకుండలా కన్పిస్తున్నాయి.

బుట్టాయగూడెం రూరల్: మెరకగూడెం గ్రామంలో మాలమెట్టవాగు చెరువు లాకు వద్ద మట్టి కొట్టుకుపోయింది. అయితే వెంటనే గ్రామస్తులు స్పందించి మట్టి వేయడం ద్వారా పెనుప్రమాదాన్ని నివారించారు. ప్రతి సంవత్సరం వర్షాల సమయంలో ఈ సమస్య పునరావృతమవుతుందని, అధికారులు ఇప్పటికైనా ఈ సమస్య పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జీలుగుమిల్లి: అల్ప పీడన ప్రభావంతో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రహదారులన్నీ జలమయమయ్యాయి. వాగుల గుండా వరద నీరొచ్చి చెరువుల్లో చేరడంతో చెరువులు పొంగిపొర్లుతున్నాయి. నారుమళ్లు ఇంకా ముంపులోనే ఉన్నాయి. కామయ్యపాలెం, అశ్వారావుపేట వాగుల గుండా వరద ప్రవాహం కాస్త తగ్గుముఖం పట్టింది. జీలుగుమిల్లి సిఐ క్రాంతికుమార్ ఆధ్వర్యాన సిబ్బంది రోడ్లపై అడ్డంగా పడి ఉన్న చెట్లకొమ్మలను తొలగించారు. వేలేరుపాడు వెళ్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆగి వర్షాలు, వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఆర్‌వి.వెంకటేశ్వరరావును ఆదేశించారు.

పోలవరం: మండలంలో నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. శుక్రవారం కూడా భారీ వర్షం కురిసింది. ఈ వర్షాలకు గుంజవరం, పేడ్రాల కాలువలు పొంగుతున్నాయి. కొండవాగులు ఉప్పొంగి గుంజవరం కాజ్‌వేపై నుండి ప్రవహించాయి. ఎల్ఎన్‌డిపేట రిజర్వాయర్లోకి కొండవాగుల జలాలు వచ్చి చేరుతున్నాయి. ఈ రిజర్వాయర్ సామర్థ్యం 90.05 టిఎంసిలు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీటిమట్టం 87.35 టిఎంసిలకు చేరుకుందని ఎఇ కొండలరావు తెలిపారు. మెత్తప్పకోట, సున్నాలగండి వాగుల వరద వింజరం గోవిందరాజుల చెరువులోకి ప్రవహిస్తుండటంతో చెరువు నిండి పొలాల్లోకి వరద నీరు చేరుతోంది. ఇటుకలకోట ఇసుక కాలువ వరద కడమ్మ కాలువ ద్వారా ప్రవహించి కడమ్మ స్లూయిస్ నుంచి గోదావరిలో కలుస్తోంది. కొవ్వాడ కాలువ వరద పట్టిసీమ అవుట్‌ఫాల్ స్లూయిస్ నుంచి గోదావరిలో కలుస్తోంది. గూటాల రెవెన్యూ పరిధిలో కొవ్వాడ ప్రధాన కాలువకు రెండు కిలోమీటర్ల మేర పూడికతీత పనులు చేయకపోవడం వల్ల కొవ్వాడ కాలువ జలాలు పంట పొలాల్లోకి ప్రవహించి సుమారు రెండువేల ఎకరాల వరి చేలు నీట మునిగాయని జల్లేపల్లి శివ సూర్యనారాయణ, నక్క ప్రేమానందం, పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

టి.నరసాపురం: మండలంలో శుక్రవారం కూడా వర్షం ఎడతెరిపి లేకుండా కురవడంతో వాగుల ఉధృతి కొనసాగుతోంది. ప్రధానంగా మక్కినవారిగూడెం సమీపంలో దుర్గ గుడి వద్ద జలవాగు, బండివారిగూడెం - గంగినీడుపాలెం ముగ్గురాళ్ల వాగు, మధ్య హ్నవువారి గూడెం-అప్పలరాజుగూడెం గ్రామాల మధ్య ఎర్రకాలువ ఉధృతి తగ్గలేదు. వరదనీరు వంతెనపై నుంచి ప్రవహిస్తోంది. ఆయా మార్గాల్లో రాకపోకలను పోలీసులు నియంత్రిస్తున్నారు. కాలువలు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మక్కినవారిగూడెం, గంగినీడుపాలెం, నాయకులుగూడెం, సీతంపేట తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాల ప్రజలు బయటకు వెళ్లే పరిస్థితి లేదు.

చింతలపూడి: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలం మొత్తం జలమయమైంది. శుక్రవారం కూడా వర్షం కొనసాగడంతో పంట పొలాలు నీట మునిగాయి. వరినాట్లు వేసిన రైతులు పంటపొలాల్లో నీరు నిల్వ లేకుండా చేసేందుకు చేసిన ప్రయత్నాలు వర్షం వల్ల విఫలమయ్యాయి. వర్షం కొనసాగితే నారు, నాట్లు కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలో ఎక్కడ చూసినా వర్షపు నీరు రోడ్లపైకి రావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.


వాగుల ఉధృతి తగ్గుముఖం- దెబ్బతిన్న రోడ్లు



బుట్టాయగూడెం: రెడ్డిగణపవరం వద్ద జల్లేరు ఉధృతికి దెబ్బతిన్న కాజ్‌వే



టి.నర్సాపురం: ఉధృతంగా ప్రవహిస్తున్న ముగ్గురాళ్ల వాగు



కుక్కునూరు రూరల్: గుండేటి వాగు ఉధృతికి కొట్టుకుపోయిన రోడ్డు

నేడు పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భారీ వర్షాల కారణంగా శనివారం జిల్లాలోని అన్ని పాఠశాలలకు డిఇఒ అబ్రహం సెలవు ప్రకటించారు. ఈ మేరకు అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని యాజమాన్యాల పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేట్, ఎయిడెడ్, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల పరిధిలోని అన్ని పాఠశాలలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని ఆయన తెలిపారు.

వర్ష, వరద బాధితులను ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


భారీ వర్షాలు, వరదల వల్ల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల జిల్లాలో ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో కొండవాగులు, కాలువలు వరద నీటితో నిండి రవాణా సమస్యలతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తాగునీరు సరఫరా దెబ్బతినడంతో కలుషిత నీరు తాగి డయేరియా, విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఏజెన్సీ ప్రాంతాలకు, మారుమూల గ్రామాలకు యుద్ధప్రాతిపదికన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలని కోరారు. అన్ని పిహెచ్‌సిల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో రోడ్లు దెబ్బతిని రవాణా సౌకర్యాలకు అంతరాయం ఏర్పడిందని, కొన్నిచోట్ల చిన్నచిన్న వంతెనలు, కల్వర్టులు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు వగైరా బాగుచేసి రవాణా వ్యవస్థను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా పట్టినపాలెం, రెడ్డిగణపవరం వంతెన నిర్మించకపోవడం వల్ల ఏజెన్సీ ప్రాంతవాసులకు రవాణా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పెదవాగు ప్రాజెక్టు తెలంగాణ ఆధీనంలో ఉన్నందు వల్ల దాని వల్ల వచ్చే దుష్పరిణామాలు విలీన మండలాలపై పడుతున్నాయని, ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై వెంటనే ఆలోచించి విలీన మండలాల ప్రజలను ఆదుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికే వేసిన వరినాట్లు మునిగి దెబ్బతినే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. భారీ వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న పంటల నష్టాన్ని అంచనా వేసి రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలని రవి డిమాండ్ చేశారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి: రైతుసంఘం

భారీ వర్షాల వల్ల పంటలు ముంపునకు గురై నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. శుక్రవారం స్థానిక అన్నే భవనంలో భారీ వర్షాల వల్ల పంట నష్టాలపై ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరి నారుమళ్లు, నాట్లు వేసిన చేలకు నష్టం వాటిల్లే పరిస్థితి ఉందన్నారు. కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతంలో కాలువల ఆధునికీకరణ జరగకపోవడం, కాలువల్లో గుర్రపుడెక్క, తూడు, కర్రనాచు, కిక్కిస పేరుకుపోవడం ముంపునకు కారణమని చెప్పారు. ఇప్పుడైనా కాలువలను ఆధునికీకరించాలని కోరారు. కొన్నిచోట్ల కూరగాయలు, అరటి తదితర పంటలు దెబ్బతిన్నాయన్నారు. పంట నష్ట పోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉచితంగా విత్తనాలు, ఎరువులు అందించాలని కోరారు.

తమ్మిలేరు రిజర్వాయర్‌కు వరద ఉధృతి

ప్రజాశక్తి - చింతలపూడి



నిండుకుండలా తమ్మిలేరు జలాశయం

జిల్లాలోని చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం వద్ద గల తమ్మిలేరు రిజర్వాయర్‌లోకి వరద ఉధృతి కొనసాగింది. శుక్రవారం సాయంత్రం అందిన సమాచారం ప్రకారం రిజర్వాయర్‌లోకి 3749 క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లో ఉందని ఎఇ పరమానందం తెలిపారు. రిజర్వాయర్ నీటిమట్ట సామర్థ్యం 355 అడుగులుండగా ప్రస్తుత నీటిమట్టం తమ్మిలేరు బేసిన్ 341.68 అడుగులుగా, గొనెలవాగు బేసిన్ 338.1 అడుగులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 3 టిఎంసిలుండగా ప్రస్తుత నీటినిల్వ సామర్థ్యం 1.026 టిఎంసిలని పరమానందం తెలిపారు.

పట్టిసీమ నుంచి నీటి విడుదల నిలిపివేత

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు గోదావరి జలాల విడుదల నిలిపివేసినట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పెద్దిరాజు శుక్రవారం తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 17.240 మీటర్లకు చేరుకుంది. దాని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటి విడుదల నిలిపివేసినట్లు తెలిపారు. ఈ నెలలో ఇప్పటివరకు 7.1653 టిఎంసిల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

పాఠశాలలో ఎంఎల్ఎ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులకు వసతుల విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ అన్నారు. మండలంలోని వెలగలపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న సమస్యలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలో మరుగుదొడ్లు, చుట్టూ ప్రహరీ నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

బోరు నుంచి ఎగసిపడిన నీరు

ప్రజాశక్తి - కామవరపుకోట


బోరు నుంచి ఎగిసిపడుతున్న నీరు

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వరద నీరు కారణంగా ఓ రైతు పొలంలో విచిత్రంగా బోరు నుండి నీరు ఎగిసిపడింది. మండలంలోని కె.వెస్.రామవరానికి చెందిన సంకుల రాటాలరాజు ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం తన పొలంలోకి వెళ్లి చూడగా పొలం చుట్టూ వరద నీరు చేరి బోరు నుండి ఎగసిపడుతూ నీరు వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి వెళ్లి ఆశ్చర్యంగా వీక్షించారు. రెండు గంటల పాటు ఇదేవిధంగా బోరు నుండి నీరు ఎగసి పడి క్రమేపీ తగ్గినట్లు గ్రామస్తులు తెలిపారు.

వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండల కేంద్రంలో గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలను ఎంపిడిఒ జి.శ్రీను శుక్రవారం పరిశీలించారు. పోలవరం పంచాయతీ పరిధిలో యడ్లగూడెం, కమ్మరగూడెం, ఆంజనేయస్వామి ఆలయం రేవు, బిక్కుబాబా ఆలయం రేవు, గోరాయ బెలిని హోస్పిటల్ రేవుల ప్రాంతాలను పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో నరేష్ పర్యటన

కొయ్యలగూడెం : వరద ప్రభావిత ప్రాంతాల్లో టిడిపి మండలాధ్యక్షులు పారేపల్లి నరేష్ స్థానిక పంచాయతీ వార్డు సభ్యులు అనం సాయితో కలిసి పర్యటించారు. బయ్యన గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యాధికారితో మాటా చారు. వర్షాల వలన ప్రజలకు వచ్చే అనారోగ్య సమస్యల పై ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం హాస్పిటల్ చుట్టూ ఉన్న కలుపు మొక్కలు తొలగించేందుకు క్లీన్ హాస్పిటల్ కార్యక్రమాన్ని సోమవారం లోపు స్థానిక యువతతో కలిసి శ్రమదానం చేస్తామని తెలిపారు. అధ్వాన్నంగా ఉన్న సరిపల్లి రోడ్డు నిర్మాణానికి కొంత సమయం పడుతుందని, తాత్కాలికంగా ప్రజలు ఇబ్బంది పడకుండా సరిపల్లి రోడ్డులో వెళ్లే విద్యాసంస్థల, యువత సహకారంతో గోతులు పూడుస్తామని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల వల్ల నష్టం వాటిల్లకుండా డివిజన్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నూజివీడు ఆర్డిఒ భవానీ శంకరి సూచించారు. శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నందున మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. చేపలు పట్టేందుకు కాలువలు, చెరువులు, కుంటల వద్దకు వెళ్ల వద్దని హెచ్చరించారు. కంట్రోల్ రూమ్ నెంబర్ 08656 232717 ఫోన్ చేయాలని సూచించారు.

ఏలూరు సిటీ : అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఏలూరు నియోజకవర్గ ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్ఎ బడేటి చంటి సూచించారు. ఏలూరు పవర్‌పేటలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటువంటి విపత్కర సమయంలో ప్రభుత్వం తరపున చేపట్టాల్సిన సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఖాళీ స్థలాల యజమానులు సైతం తమ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా మెరక చేయాలన్నారు.

కామవరపుకోట : వర్షాల నేపథ్యంలో గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని మండలంలోని వీరిశెట్టిగూడెం హెల్త్, వెల్‌నెస్ సెంటర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జి.లక్ష్మీప్రసన్న తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కలుషితమైన నీటి ద్వారా, వర్షాల నేపథ్యంలో డయేరియా, డెంగీ, టైఫాయిడ్, మలేరియా, కామెర్లు వంటి ప్రాణాంతకమైన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుందన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని చెప్పారు. దోమలు పెరిగేందుకు అవకాశం లేకుండా ఇళ్ల వద్ద పరిసరాలు పరిశుభ్రంగా తేమ లేకుండా చూసుకోవాలని చెప్పారు. నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో ఇంకుడు గుంతలు వంటివి ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. జ్వరాలు, వాంతులు, విరేచనాలు, జలుబు, దగ్గు వంటి ఏమైనా లక్షణాలు ఉంటే గ్రామంలోని హెల్త్, వెల్‌నెస్ సెంటర్‌లో వైద్య సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

వరద పరిస్థితిపై ఎంపీ ఆరా

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఢిల్లీ నుండి వరద పరిస్థితిని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తగు సూచనలు చేస్తున్నారు. జిల్లాలో వరద పరిస్థితిపై కలెక్టర్, ఎస్‌పిలను సమన్వయం చేసుకుంటూ సమీక్షిస్తూ ఉన్న ఎంఎల్‌ఎ, తదితర ప్రజా ప్రతినిధులకు తగు సూచనలు చేస్తున్నారు. ఎర్రకాలువ జలాశయ నీటి మట్టాన్ని అంచనా వేసుకుంటూ ప్రజాప్రతినిధులను, అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.

శ్రీసీతామహాలక్ష్మి ఆశ్రమం సందర్శన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెంలో రెండు రోజుల కురుస్తున్న వర్షాల కారణంగా శ్రీసీతామహాలక్ష్మి వృద్ధాశ్రమంలో వృద్ధులు, వికలాంగులు పడుతున్న కష్టాలను మీడియా, సోషల్ మీడియాలో చూసిన కలెక్టర్ వెట్రిసెల్వి వెంటనే స్పందించారు. ఈ ఆశ్రమంలో ఆసరా లేని 20 మందికి పైగా వృద్ధులు, వికలాంగులను ఆశ్రమ నిర్వాహకులు జయవరపు శేఖర్ చూసుకుంటున్నారు. ప్రతి వర్షాకాలం కూడా ఈ ఆశ్రమంలో ఉన్నవారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటూ ఉంటారు. సమస్యను గతంలో పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందించలేదు. నూతనంగా వచ్చిన కలెక్టర్ వెట్రిసెల్వి స్పందించి ఆశ్రమానికి మున్సిపల్ కమిషనర్ జె.నరేంద్ర కుమార్, తహశీల్దార్ సెల్వ జోష్ని, ఎస్ఐ జ్యోతిబసు, వీఆర్ఓలను పంపించారు. వృద్ధుల బాగోగుల గురించి, ఆశ్రమ నిర్వహణ విషయాల గురించి నిర్వాహకులు శేఖర్‌ను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. స్థలం మంజూరు చేయాలని శేఖర్ కోరారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి : వ్యకాస

ప్రజాశక్తి - పోలవరం

ఏజెన్సీ గ్రామాల్లో నివసిస్తున్న గిరిజన సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సముద్రాల సాయికృష్ణ అన్నారు. మండలంలోని ఇటుకలకోట గ్రామంలో మోటకం రాంబాబు అధ్యక్షతన శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికృష్ణ మాట్లాడుతూ ఇటుకలకోట గ్రామంలో కరెంట్ స్తంభాలు పాడై ఉన్నాయని, కొత్త స్తంభాలు వేయాలని, అటవీ ప్రాంతంలో చెక్ డ్యాం నిర్మించాలని, ప్రస్తుతం ఉన్న కరెంటు స్తంభాలు దూరంగా ఉండటంతో వైర్లు కిందకు వాలిపోయి ప్రమాదాలకు గురయ్యే విధంగా ఉన్నాయన్నారు. కొత్త డ్రెయినేజీలు, తాగునీటి ట్యాంకులు నిర్మించాలని, ఉపాధి హామీ కూలీలకు వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దొరమామ లక్ష్మి, కొమరం పోసిరత్నం, కోటం రత్తమ్మ, మీడియం రామలక్ష్మి పాల్గొన్నారు.

రజక సంఘం మండలాధ్యక్షునిగా నాగరాజు

ముదినేపల్లి : రజక సంఘం ముదినేపల్లి అధ్యక్షునిగా యలకుర్తి నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యలకుర్తి నాగరాజు అధ్యక్షతన రజక సంఘం సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ముదినేపల్లి రజక సంఘం నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. రజక సంఘం ఉపాధ్యక్షులు మీసాల సత్యనారాయణ, రాజ మండ్రి శ్రీనివాసరావు, సెక్రటరీగా రావులపాటి వెంకటసుబ్బారావు, జాయింట్ సెక్రటరీ శీలంగా మాడెం శ్రీను, నిడుమోలు హనుమంతరావు, ట్రెజరర్‌గా మల్లంపల్లి కొండల రావులను రజక సంఘం సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వంకరగా డ్రెయినేజీ నిర్మాణం

పట్టించుకోని అధికారులు
పొంచి ఉన్న ప్రమాదాలు
భయాందోళనలో స్థానికులు

ప్రజాశక్తి - మండవల్లి

డ్రెయినేజీ నిర్మాణంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని, పనులపై పర్యవేక్షణ ఉండడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంట్రాక్టర్ డ్రెయినేజీని ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ప్రమాదాలు పెరిగి వాహనదారులు మృత్యువాత పడే ప్రమాదం పొంచి ఉందని భయాందోళన చెందుతున్నారు.

జాతీయ రహదారి అభివృద్ధిలో ఏం జరిగిందో ఏమోగానీ కైకలూరు సందు వద్ద డ్రెయినేజీ నిర్మాణానికి అవసరైమనంతా భూమిని అధికారులు కొనుగోలు చేయలేదు. తక్కువ భూమిని కొనుగోలు చేశారు. మరో రేకుల షెడ్డుకు డబ్బులు చెల్లించలేదు. దీంతో ఆ ప్రాంతంలో డ్రెయినేజీ నిర్మించడానికి భూమిదారుడు, రేకులషెడ్డుదారుడు అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. దీంతో కాంట్రాక్టర్ ఆ ప్రాంతంలో సుమారు రెండు మీటర్ల మేర డ్రెయినేజీని ముందుకు జరిపి వంకరగా నిర్మిస్తున్నాడు. అయినప్పటికీ అధికారులు వంకరగా నిర్మిస్తున్న డ్రెయినేజీపై కన్నెత్తి కూడా చూడడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.


వంకరగా నిర్మిస్తున్న డ్రెయినేజీ

అధికారులు పట్టించుకోకపోవడంతో అభ్యంతరాన్ని వ్యక్తం చేయగా కాంట్రాక్టర్ తమపై దౌర్జన్యాలకు దిగినట్లు స్థానికులు చెబుతున్నారు. డ్రెయినేజీ నిర్మాణం ప్రారంభం నుంచి కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, భూమిని కొనుగోలు చేయకుండానే పనులు ప్రారంభించాడని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. వెలమపేట వద్ద నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్న డ్రెయినేజీ పనుల వల్ల ఒక కూలి దుర్మరణం పాలయ్యాడని, నిర్మించిన డ్రెయినేజీపై ఉన్న గుంతల్లో పడి ఎంతోమంది గాయాలపాలయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నిర్లక్ష్యంగా నిర్మిస్తున్న రహదారి అభివృద్ధి పనులు కొంతమందిని బలి తీసుకోగా మరి ఎంతోమంది క్షతగాత్రులుగా మిగిలిపోయారని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పుడు వంకరగా నిర్మిస్తున్న డ్రెయినేజీ ప్రాంతంలో ప్రమాదాలు చోటుచేసుకుని ఇంకెంతమంది మృత్యువాత పడాల్సి వస్తుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి డ్రెయినేజీ నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని కొనుగోలు చేసి యధావిధిగా డ్రెయినేజీ నిర్మించేలా చర్యలు తీసుకొని ప్రమాదాలు జరగకుండా వాహనదారులను, ప్రజలను కాపాడాలని స్థానికులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

దీనిపై ఎన్‌హెచ్ ఎఇ శరత్‌ను వివరణ కోరగా కైకలూరు సందు ప్రాంతంలో ఒకచోట అధికారులు తక్కువ స్థలాన్ని కొనుగోలు చేశారని తెలిపారు. భూమిని కొనుగోలు చేసి రేకుల షెడ్డుకు డబ్బులు చెల్లించడం సాధ్యం కాదన్నారు. త్వరితగతిన పూర్తి చేయాలనే లక్ష్యంతో డ్రెయినేజీ వంకరగా నిర్మిస్తున్నామన్నారు. ఆ ప్రాంతంలో ఏడు మీటర్ల రోడ్డు సరిపోతుందని చెప్పారు. ఆ ప్రాంతంలో ప్రమాదాలు జరగకుండా శాశ్వత కాలం ఉండేలా ప్రమాద సూచికలను ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సురక్షిత ప్రాంతాలకు గర్భిణులు

ప్రజాశక్తి - వేలేరుపాడు

వేలేరుపాడు మండలంలోని పలువురు గర్భిణులను ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చేర్చినట్లు ఐసిడిఎస్ పీడీ కె.పద్మావతి తెలిపారు. కలెక్టర్ వెట్రిసెల్వితో పాటు పలువురు జిల్లా అధికారులు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు సంబంధిత వైద్యులు పరీక్షిస్తున్నారని పద్మావతి తెలిపారు. మండలంలోని 12 నివాసిత ప్రాంతాల్లోని 31 మంది గర్భిణులను, 27 మంది బాలింతలను గుర్తించి వారికి అవసరమైన వైద్య సేవలను అందించనున్నట్లు చెప్పారు. జిల్లా స్థాయి అధికారులు గ్రామాల్లో ఉన్న ప్రజలకు మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు.

సిపిఎం జిల్లా తరగతులు వాయిదా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెంలో ఈ నెల 19, 20, 21 తేదీల్లో జరిగే సిపిఎం జిల్లా శిక్షణా తరగతులు వాయిదా పడ్డాయని ఆ పార్టీ మండల కార్యదర్శి ఎం.జీవరత్నం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పార్టీ ముఖ్య కార్యకర్తలందరికీ మూడు రోజులపాటు జిల్లా శిక్షణా తరగతుల నిర్వహణకు సిద్ధం చేశామన్నారు. జిల్లాలో వర్షం కురవడంతో అధికంగా ఏజెన్సీ మండలాల్లో ఎక్కువ వర్షపాతం నమోదు కావడంతో వేలేరుపాడు, కుక్కునూరు గోదావరి దాటికి జలమయం అయ్యాయన్నారు. గ్రామాలు నీటిలో మునిగాయని జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, పోలవరం మండలాల్లో వాగులు పొంగటంతో ప్రజానీకం రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని తెలిపారు. అందుకోసం ఏజెన్సీ ఐదు మండలాల్లో పార్టీ కార్యకర్తలు నీటిలో మునిగిన గ్రామాలు ప్రజల వద్దకు వెళ్లి సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో శిక్షణా తరగతులు వాయిదా పడ్డాయని చెప్పారు. వర్షాలు తగ్గిన తర్వాత ఈ శిక్షణా తరగతులను నిర్వహిస్తామని, ఈ మార్పును పార్టీ కార్యకర్తలు, తోడ్పాటు ఇచ్చిన పెద్దలు, మిత్రులు, వ్యాపారులు, శ్రేయోభిలాషులు గమనించాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 20వ తేదీ శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనునట్లు ఎంపిడిఒ చాగంటి పద్మావతి దేవి తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సమాచార పౌర సంబంధాల శాఖ, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి రావొచ్చని, మండలంలోని 16 గ్రామాల ప్రజా ప్రతినిధులు, మండల శాఖాధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని చెప్పారు.

ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ ఆదేశించారు. చింతలపూడి, ధర్మాజీగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్‌తో ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మాజీగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య గతేడాదితో పోలిస్తే పెరుగుదల కనిపించడం మంచి పరిణామమన్నారు. పది రోజుల క్రితం నిర్వహించిన సమావేశంలో ఆగస్టు 15 నాటికి కనీసం 30 అడ్మిషన్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో గ్రామాల్లో తిరిగి తల్లిదండ్రులను కలిసి కళాశాలలో కల్పిస్తున్న వసతుల గురించి అధ్యాపకులు అవగాహన కల్పించారు. ప్రస్తుతం అడ్మిషన్ల సంఖ్య 28కి చేరింది. అనుకున్న లక్ష్యం 30 కన్నా ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు చేరే అవకాశం ఉన్నట్లు ఎంఎల్ఎ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కళాశాలల గొప్పతనాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు అర్థమయ్యేలా చెప్పాలని ఎంఎల్ఎ రోషన్‌కుమార్ అధికారులకు సూచించారు.

దోమల నివారణా చర్యలపై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు మున్సిపాలిటీలో దోమల నివారణ, పరిశుభ్రత కోసం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించారు. ఇంట్లో, పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కువ రోజులు నిల్వ ఉండే నీటిలో దోమ లార్వా తయారవుతుందన్నారు. ఆ లార్వా వృద్ధి చెంది దోమలు తయారవుతాయన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా దోమల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. కలుషిత నీరు, ఆహారం వల్ల టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు వస్తాయని, ప్రజలు పరిశుభ్రత పాటించాలని పిలుపునిచ్చారు. నూజివీడులో నీరు క్లోరినేషన్ చేసి ఇంటింటికీ సరఫరా చేస్తున్నామన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ల ద్వారా మంచినీటి పైపుల నుంచి నీరు సేకరించి సైతం వాటర్ టెస్టింగ్ కూడా విధిగా చేస్తున్నామని, మున్సిపాలిటీ పరిధిలో కాల్వలు శుభ్రం చేస్తున్నామని, దోమల నివారణకు దోమల మందు పిచికారీ చేస్తున్నామని తెలిపారు. పారిశుధ్యం, పరిశుభ్రత, దోమల నివారణకు ప్రత్యేక శ్రద్ధతో మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలకు పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎంలు నేరుగా వెళ్లి విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. డ్రై డే కార్యక్రమం శుక్ర, శని, ఆదివారాల్లో ఏదో ఒకరోజు సచివాలయ ఉద్యోగులందరూ పాల్గొని ప్రతి ఇంటినీ తనిఖీ చేసి ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, సచివాలయ కార్యదర్శులు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తల బృందం స్వయంగా కొన్ని ఇళ్లను తనిఖీ చేసి వారికి అవగాహన కల్పించారు. అనంతరం ఇళ్లు, పరిసరాలు శుభ్రం ఉంచుకోవడం సామాజిక బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ ఆ ప్రాంత ప్రజలకు తెలిపారు.

అధికారుల వద్ద తేలుస్తాం

విలేకరికి బెదిరింపు కాల్స్..!

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రజాశక్తి ముదినేపల్లి మండల విలేకరికి గత రెండు రోజుల నుంచి ఆక్వా రైతుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. మండలంలోని సిబి కెనాల్‌పై జరుగుతున్న తాగునీటి చౌర్యంపై ఈ నెల 18వ తేదీ గురువారం ప్రజాశక్తి దినపత్రికలో దర్జాగా నీటి చౌర్యం అనే శీర్షికతో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన సంబంధిత జల వనరుల శాఖాధికారులు పర్యటించి కాలువ ద్వారా మంచినీటి చెరువులకు వెళ్తున్న తాగునీటిని చేపల చెరువులకు మళ్లిస్తున్న కరెంటు మోటార్లు, ఆయిల్ ఇంజన్లు, వాటి పైపులను సిబ్బందితో తొలగించారు. చేపల చెరువులకు నీటిని తోడుతున్న మోటార్లను సిబ్బంది తొలగించడంతో పలువురు ఆక్వా రైతులు విలేకరికి ఫోన్ చేసి “నీవు పేపర్లో వార్త రాయబట్టే లస్కర్లు వచ్చి చెరువులకు నీటిని తోడుతున్న మా ఇంజన్లు, మోటార్లు తీసేసారు” అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ప్రభుత్వానికి శిస్తూ కడుతున్నామని, ఊరికే తోడుకోవటం లేదన్నారు. ఈ విషయం డిఇ వద్ద, ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి నీ వ్యవహారం తేలుస్తామంటూ బెదిరించారు. విలేకరిని బెదిరించిన ఈ వ్యక్తులు మండలంలోని కొరగుంటపాలెం గ్రామానికి చెందినవారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు బిజెపిలో చేరినట్లు సమాచారం.

వరి పొలాల పరిశీలన

రైతులకు మండల వ్యవసాయాధికారి సూచనలు, సలహాలు

ప్రజాశక్తి - ముసునూరు

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల వల్ల వరి పంటకు నష్టం కలిగే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి ఎస్.మధుమోహన్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వరి పంటలను, వరి నాటే విధానాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల వల్ల రైతులకు కొంతమేర నష్టం వాటిల్లిందన్నారు. చెరువుల్లోకి, కాల్వలోకి వర్షపు నీరు అధికంగా రావడంతో బోర్ల కింద వ్యవసాయం లేని రైతులు వరి పంట సాగు చేసుకోవటానికి మక్కువ చూపుతున్నారన్నారు. రైతు వరి నాటే విధానంలో మొక్కకు, మొక్కకు 15 సెంటీమీటర్లు దూరం పాటించాలన్నారు. అలాగే 20 మీటర్ల దూరంలో కాలిబాటలు వేయించుకుంటే పురుగుమందులు పిచికారీ చేసుకోవటానికి, ఎరువులు చల్లుకోవడానికి, క్రిమిసంహారక మందులు చల్లుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. అంతేకాకుండా పంట గాలి ఆడి అధిక మొత్తంలో దిగుబడి రావడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఇంకా కొన్ని గ్రామాల్లో నారుమడి దశలో ఉన్న వరి నారి మడులకు వర్షం కారణంగా పురుగు ఉంటుందన్నారు. పురుగుమందులు, గులుకులు పిచికారీ చేయడం వల్ల నివారణ సాధ్యమన్నారు. వరి నాటిన పొలంలో అధికంగా నీరు ఉంటే పిలకలు రావడానికి అవకాశం ఉండదని, దుబ్బు చేయదని, దిగుబడి రావడానికి కష్ట సాధ్యమవుతుందని చెప్పారు.


ముసునూరు : వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి మధుమోహన్

కామవరపుకోట : రెండు రోజుల నుంచి అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రావికంపాడు గ్రామంలో నాట్లు వేసిన వరి చేళ్లను మండల వ్యవసాయాధికారి సి.పవన్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. నారుమడి దశలో ఉన్న వరి పంట, విత్తనం చల్లిన రెండు మూడు రోజుల వయసులో ఉన్నప్పుడు, మూడు రోజుల కన్నా ఎక్కువ నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందన్నారు. ఈ దశలో వీలైనంత తొందరగా నీటిని పూర్తిగా బయటకు తీసివేయడం వల్ల విత్తనం కోర గాలి పోసుకొని ఎటువంటి నష్టం జరగదన్నారు. అలా కాకుండా నీరు తీయడానికి వీలు లేక మొలక దెబ్బతింటే తిరిగి విత్తనం చల్లుకోవాల్సిన అవసరం ఏర్పడుతుందన్నారు. విత్తిన ఏడు నుంచి 30 రోజుల మధ్యలో నారుమడి ఐదు రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. నారు నీట మునిగిన ఐదు రోజుల లోపు నీటిని పూర్తిగా బయటకు తీసివేసి పంటకు గాలి తగిలేలా చేయాలన్నారు. నష్ట నివారణకు నీటిని తీసివేసిన తర్వాత ఐదు సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవడం వల్ల కొత్త ఆకు వచ్చి ఊడ్పులకు అందుతుందన్నారు. అధిక వర్షాలకు నారు మడి దశలో పంట తెగుళ్ల బారిన పడకుండా, నీరు పూర్తిగా తీసివేసి మొక్క నిలదొక్కుకున్న తరువాత లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం, రెండు గ్రాముల కార్బెండిజం, మాంకోజెబ్ కలిసిన మిశ్రమములో కలిపి పిచికారీ చేయాలన్నారు. పంట ఊడ్చిన వెంటనే, పిలక దశలో ముంపునకు గురైతే నీటిని పూర్తిగా బయటకు తీసివేసి తర్వాత పైపాటుగా ఎకరాకు 20 కిలోల యూరియా 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అదనంగా వేసుకోవాలన్నారు. ఈ విధంగా బూస్టర్ డోస్ వేసుకోవడం వల్ల మొక్క ముంపు ప్రభావం నుంచి త్వరగా కోలుకుంటుందన్నారు. మొక్క కోలుకున్న తరువాత కుళ్లు, తెగుళ్లు రాకుండా లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పొలంలో ఉన్న నీరు మురుగు కాల్వల ద్వారా బయటకు వెళ్లేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆయనతో పాటు రైతులు, గ్రామాధికారి ఎస్.వెన్నెల ఉన్నారు.

గ్రామాల్లో పందుల స్వైర విహారం

ఆందోళనలో జనం
పరిసరాలు అపరిశుభ్రం చేస్తున్నాయని ఆవేదన
ఉన్నతాధికారులు పట్టించుకోవాలని వేడుకోలు


గ్రామాల్లో సంచరిస్తున్న పందులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని అన్ని గ్రామాల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. నిత్యం పందులు పంది పిల్లలతో కలిసి రోడ్లపై తిరుగాడుతున్నాయి. ఉదయం నుంచి నుంచి రాత్రి వరకు పందులు రోడ్లపై, జన నివాసాల చుట్టూ సంచరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఇంటి పెరటిలో ఉన్న ఆకుకూరలు, పూల మొక్కలను పాడుచేస్తూ పరిసరాలను అశుభ్రపరుస్తున్నాయి. వీటి చేష్టలతో మహిళలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. అసలే వర్షాలు పడుతున్న ఈ తరుణంలో గ్రామాల్లో పందుల సంచారం వల్ల పలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పందుల సంచారం కారణంగా పిల్లలకు మెదడువాపు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పందులు విచ్చలవిడిగా రోడ్లపై తిరుగుతుండడంతో ద్విచక్ర వాహనదారులు పలుసార్లు ప్రమాదాలు బారిన పడుతున్నారు. పందులు రోడ్లపై పరుగులు తీస్తూ ద్విచక్ర వాహనాలకు అడ్డుగా రావడంతో వాహన దారులు ప్రమాదాలు బారిన పడుతూ క్షతగాత్రులుగా మారుతున్నారు. గ్రామాల్లో పందులు యథేచ్ఛగా తిరుగుతున్నా గ్రామపంచాయతీ పాలకవర్గాలు పట్టించుకోవడం లేదంటూ జనం గగ్గోలు పెడుతున్నారు. ఎన్నిసార్లు పంచాయతీ పాలకవర్గానికి ఫిర్యాదు చేసినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు విమర్శలు చేస్తున్నారు. వర్షాకాలంలో ఈ పందుల విచ్చలవిడి సంచారం వల్ల ప్రజలు వ్యాధుల బారిన పడి ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందంటూ జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు పందుల పెంపకందారులు పందులను బయటకు వదిలి వేయడంతో అవి గ్రామాల్లో తిరుగుతూ కూరగాయల తోటలను, పెరట్లో మొక్కలను పాడు చేస్తున్నాయంటున్నారు. మరికొన్ని గ్రామాల్లో పెంపకం దారులు పందులకు జననివాసాల దగ్గర షెడ్లు ఏర్పాటు చేసి పెంచుతున్నారు. ఈ విషయమై జనం ఫిర్యాదు చేసినప్పటికీ పంచాయతీ పాలకవర్గాలు పట్టించుకోవడంలేదంటూ ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు పందుల పెంపకం దారులకు రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో ఎవరిని లెక్క చేయడం లేదు. పందుల పెంపకాలు చేపడుతూ పందులను విచ్చలవిడిగా జననివాసాల్లోకి వదిలేస్తూ ప్రజారోగ్యానికి కీడు చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి పందులు పెంపకం దారులపై తగిన చర్యలు తీసుకుని పందుల నివారణ చర్యలు చేపట్టాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

వంతెనలు నిర్మించాలి

కెవిపిఎస్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పట్టినపాలెం, రెడ్డిగణపవరం, వీరన్నపాలెం, కోట రామచంద్రపురం, పద్మవారిగూడెం గ్రామాల్లో ఉన్న కాలువలపైన వంతెనలు నిర్మించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వర్షాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, చిన్నపాటి వర్షానికి కొండవాగులు పొంగి పొరలడంతో కల్వర్టులపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తుందన్నారు. దీంతో బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి ఎటువంటి ప్రమాదం ఏర్పడినా ఎమర్జెన్సీగా 108 వాహనాలు రావాలన్నా కుదరదన్నారు. వర్షం వచ్చి వాగులు పొంగితే పాఠశాలలు మూతపడుతున్నాయన్నారు. రెడ్డిగణపవరం, వీరన్నపాలెం, ఇప్పలపాడు, జంగారెడ్డిగూడెం మండలం పట్టినపాలెం దగ్గర ఉన్న కాలువలో ఇప్పటివరకు 18 మంది వర్షాకాలంలో కొండవాగుల్లో కొట్టుకుపోయా రన్నారు. పట్టినపాలెం బ్రిడ్జి ప్రారంభించి 15 ఏళ్లవుతున్నా ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. ప్రజలు ఆరోగ్యపరంగా, ప్రయాణ లపరంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొండ వాగులు పొంగి పొర్లడం వల్ల సత్యసాయి మంచినీటి సరఫరా పైపులైన్లు పగిలిపోవడంతో మంచినీటికి బదులు మురుగునీరు వస్తుందన్నా రు. ఏ ప్రభుత్వం వచ్చినా ఏజెన్సీ ప్రజల సమస్యలు పట్టించుకో వడంలేదన్నారు. ఇప్పటికైనా టిడిపి కూటమి ప్రభుత్వం ఈ బ్రిడ్జిలను కట్టించాలని కోరారు. ఆయనతో పాటు శివుడు, భీముడు, సున్నం కృష్ణ, పాతపాటి సుబ్రహ్మణ్యం, రాజు ఉన్నారు.